క్లుప్తంగా

15న వాహనాల వేలం

బెల్లంపల్లి: ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 15న బహిరంగ వేలం వేయనున్నట్లు బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ డి.దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ నేరాల కింద 15వాహనాలను జప్తు చేసినట్లు తెలిపారు. ఆ వాహనాలకు నిర్దేశించిన తేదీన ఉదయం 10గంటలకు బెల్లంపల్లి ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు వాహన అప్‌సెట్ ధరలో 50శాతం ఈఎండీగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు వాహనాలను పరిశీలించుకోవడానికి ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఉచిత పశువైద్య శిబిరం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలోని శేషుపల్లిలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 32గేదె జాతి పశువులు, 12ఆవులకు గర్భకోశ చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పశువైద్యాధికారి వసీం, గోపాలమిత్ర జిల్లా సూపర్‌వైజర్ రవి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్ జిలకర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి: మండలంలోని చింతపల్లికి చెందిన నిరుపేద యువతి కుదురుపాక సంధ్యారాణి వివాహానికి, క్యాతన్‌పల్లికి చెందిన ఆకిరెడ్డి రవీందర్–లావణ్య దంపతులు రూ.10వేల నగదుతో పాటు పెళ్లిబట్టలను శనివారం అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ మధుకర్, తెలంగాణ జాగృతి నాయకుడు చందు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

మందమర్రిరూరల్: తెలంగాణలో ఎన్నికల ముందు లక్ష రూపాయలు రుణాలు తీసుకున్న రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేయాలని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేపట్టి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సమ్మయ్య, షరీఫా, తిరుపతి, రామస్వామి, సంపత్, సురేందర్, రాజు, రవి, రజియా తదితరులు ఉన్నారు.

'ఎస్టీ జాబితాలో కలపడం విరమించుకోవాలి'

కాసిపేట: ఎస్టీ జాబితాలో మరో 11కులాలను కలిపేందుకు తీర్మానం చేయడాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ విరమించుకోవాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేష్ మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు, 11కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడి, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కనకరాజు, మండల అధ్యక్షుడు ఆత్రం జంగు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ కానుక అందజేత

కాసిపేట: పెద్దనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ వేముల కృష్ణ సోమగూడెం న్యూ కాలనీలోని నిరుపేద కుటుంబానికి కల్యాణ కానుకగా రూ.5,116తో పాటు చీర, సారే అందించారు. సర్పంచ్ గతంలో ఇచ్చిన మాట ప్రకారం గ్రామ పంచాయతీలోని పేద కుటుంబాలకు చీర, సారే, నగదు అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కంబాల తిరుపతి, బన్న ఇందుమతి, కొమురక్క, నాయకులు దేవేందర్, శ్రీధర్, నరేష్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

బుల్లి పిట్ట.. బుజ్జి పిట్ట!

కాలం మారుతోంది.. అభిరుచులు మారుతున్నాయి. పక్షులను పెంచుకోవటం మానవులకు నేడు హ్యాబీగా మారుతోంది. ఒకప్పుడు ఏ ఇంటిలోనూ పెంపుడు జంతువులు తప్పా పక్షులు కనిపించేవి తక్కువ. ఇప్పుడు ఇళ్లలో ఏ ఆవరణలో చూసినా చిట్టిచిట్టి పక్షులు అలరాలుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వీటి కోసం ప్రత్యేకంగా దుకాణాలే వెలిశాయి. చిట్టిచిట్టి పక్షుల కిలకిల సవ్వడిలు మదిని దోచేస్తున్నాయి. ఉదయాన్నే కిలకిల శబ్దాలు ఎంతో హాయిగా ఉంటుంది. వీటిని హోదా కోసం కొందరు.. ఇష్టపడి ఇంకొందరూ.. కాలక్షేపం కోసం మరికొందరు పెంచుకుంటున్నారు. కస్టమర్లకు అనుగుణంగా లభించే రంగురంగుల్లో చూడముచ్చట కొలిపే ప్రేమపక్షులపై 'సాక్షి' కథనం..

- పక్షుల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
- కిలకిలా రావాల కోసం ఇళ్లలో పెంపకం..
- ప్రత్యేకంగా వెలసిన బర్డ్ విక్రయషాపులు
- ఇంపోర్టెడ్ పక్షులపై ఆసక్తి..

మంచిర్యాలఅర్బన్: పక్షుల కిలకిల సవ్వడిలు మదిని ఎంతో ఆహ్లాదపరుస్తాయి. అలాంటివి ఎన్నో బ్యాంకాక్, ముంబాయి నుంచి మంచిర్యాలకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఒకసారి విజిల్ వేస్తే రెండు సార్లు ముచ్చటగొలిపే పలకరింపు టాకింగ్ ప్యారెట్, మనుషులంటే ఇష్టపడే ప్రేమపక్షులు(లవ్ బర్డ్స్), కాక్‌టెల్, ఆఫ్రికన్ ప్యారెట్స్, పావురాలు ఇలా ఎన్నో ఇక్కడ విక్రయిస్తున్నారు. ఎల్లో, నీలి, గ్రీన్, వైట్ ఇలా పలురంగుల్లో పక్షులు లభిస్తున్నాయి. ఇష్టపడి కొందరు, కాలక్షేపం కోసం మరికొందరు, ఎంత ధర అయినా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పక్షుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వివిధ ఆకృతుల్లో పంజరాలు అందుబాటులో ఉన్నాయి. సైజును బట్టి ధరలున్నాయి.

ధరలు ఇలా...

లవ్‌బర్డ్స్	రూ.1500(జత)కు
కాక్‌టైల్ లవ్‌బర్డ్స్	రూ.4,500 నుంచి రూ5వేలు(జత)
ఆఫ్రికా ప్యారెట్స్	రూ.5,500 నుంచి ఆ పైన(జతకు)
ముంబాయి లవ్‌బర్డ్స్	రూ.1200(జత)





ఆఫ్రికన్ ప్యారెట్





ఆహ్లాదం కోసం ..



యాంత్రిక జీవనానికి అలవాటు పడిన మనిషికి కాసేపైనా ఆహ్లాదం, చక్కటి వాతావరణం అవసరం. ప్రతి వ్యక్తి ఎక్కువ సేపు గడిపే ఇంట్లో కాలక్షేపం కోసం చిట్టిచిటి పక్షులను పెంచుకుంటున్నారు. బ్యాంకాక్, ముంబాయి నుంచి పక్షులు దిగుమతి చేసుకుంటున్నాం. మంచిర్యాల నుంచి మహారాష్ట్రలోని సిరోంచ, చంద్రపూర్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు. పక్షులకు క్రమేపీ డిమాండ్ పెరుగుతుంది. – ప్రసాద్,పెట్ వరల్డ్ నిర్వాహకుడు

లాక్‌డౌన్‌తో ఆలోచన..



హాజీపూర్ మండలం గుడిపేట్‌కు చెందిన ప్రశాంత్ ఉద్యోగరీత్యా గోదావరిఖనిలో నివసిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి పక్షులపై మక్కువ ఉండేది. మంచిర్యాలలో పక్షుల విక్రయాలు జరిపే చోటుకు రాగా ఆఫ్రికాన్ లవ్‌బర్డ్స్ చూడగానే మదిని దోచేశాయి. మొదట్లో రెండు జతలు తీసుకెళ్లగా, తర్వాత లాక్‌డౌన్ మొదలు కావటంతో ఇంట్లో ఉండి ఏమి చేయాలో తెలియలేదు. ఇంటిపట్టున ఉండటంతో బోర్‌కొట్టడం వల్ల పక్షుల పెంపకం చేపట్టాలనుకున్నాడు. అనుకున్నది తడువుగా మంచిర్యాల నుంచి 10 నుంచి 12జతలు తీసుకెళ్లాడు. ఇప్పుడు ప్రియనేస్తాలైన పక్షులతో ఎక్కువ సేపు గడపటం వల్ల ఆనందం పొందుతున్నాడు. ఇప్పుడు ఆ హాబీ లవ్‌బర్డ్స్ విక్రయాలు చేస్తూ ఆదాయం కూడా పొందుతున్నట్లు తెలిపారు. – ప్రశాంత్, పక్షి ప్రేమికుడు



కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.15
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	60
బీరకాయ	90
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
సొరకాయ	20
ఆకుగోబి	60
పూగోబి	70
క్యారెట్	50
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100

– మంచిర్యాలఅగ్రికల్చర్



రోడ్డు పనుల పరిశీలన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు పనులను సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఆ పార్టీ నాయకులు శనివారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టరుకు సూచించారు. తమ పోరాటాల ఫలితంగానే రోడ్డు పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

భీమిని: మాలీ కులస్తులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని మంచిర్యాల జిల్లా మాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెండే సత్యనారాయణ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం నాయకులు నెండుగూరి వెంకన్న, నెండుగూరి సంతోష్, కొట్రంగి శ్రీనివాస్, కొట్రంగి మధుకర్, తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలో వాల్మీకి బోయలు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ప్రకటించడాన్ని స్వాగతిస్తూ సీఎం చిత్రపటానికి బోయ కులస్తులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జమ్మిశెట్టి గట్టుమల్లు, ముస్కపోశం, లస్మయ్య, పోశం, రమేష్, రాయమల్లు, శ్రీకాంత్, రాజం, మల్లయ్య, మహిళలు, కుల పెద్దలు పాల్గొన్నారు.



తాండూర్: క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకి బోయలు



కన్నెపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బోయ కులస్తుల హర్షం

మందమర్రిరూరల్: రాష్ట్రంలో బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడంపై మందమర్రి బోయ కులసంఘం అధ్యక్షుడు బోగి వెంకటేశం, గౌరవాధ్యక్షుడు ముస్కె పైడి, ప్రధాన కార్యదర్శి శంకరయ్య శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవాలి

మందమర్రిరూరల్: విద్యార్థులు విజ్ఞానం పెంచుకుని భవిష్యత్‌లో హుందాగా జీవించాలని కార్మెల్ స్కూల్ ప్రిన్సిపల్ ఫాదర్ జెవియర్ రెక్స్ సూచించారు. స్కూల్ 60 వసంతాల ముగింపు సందర్భంగా శనివారం స్కూల్ ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక స్టాల్స్‌ను సందర్శించారు. విద్యార్థుల వేషధారణ, ఆటపాటా ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల పేరెంట్స్, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



శరీర భాగాల గురించి వివరిస్తున్న విద్యార్థిని

ఘనంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు రాజబాబు, రాజమల్లయ్య, కార్యదర్శి శ్రీనివాస్, శక్తికేంద్రం ఇన్‌చార్జి బుద్దారపు రాజమౌళి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పచ్చ వెంకటేశ్వర్లు, బి.రవి, రాము పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఇంటింటా కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



బెల్లంపల్లి: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు



జిల్లా కేంద్రంలో అభివృద్ధిని వివరిస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని 5వ వార్డు, 26వ వార్డుల్లో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, వార్డు కౌన్సిలర్ సల్ల మహేశ్, షేర్ పవన్ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని గోల్ బంగ్లా, బెల్లంపల్లి బస్తీల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పాలక పార్టీలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలుముల శంకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, మల్లయ్య, చిన్నరాజం, శారద, ఆదర్శ వర్ధన్‌రాజు, వినేష్, రోహిత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని పోతపల్లిలో కాంగ్రెస్ నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించి హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా గడపగడపకూ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. గ్రామంలోని ప్రజలతో మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు తెలియపర్చారు. కార్యక్రమంలో మండల నాయకులు చిన్నన్న, పింగిళి రమేష్, ఎండీ ఆరీఫ్, బానేష్, సురేష్, చిన్నయ్య, రాజరావు, సత్తయ్య, చందు, హాజీ, షఫీ పాల్గొన్నారు.

పేరెంట్స్ డే

బెల్లంపల్లి: విద్యార్థుల ఉన్నతికి తోడ్పడుతున్న సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీఓఈ) ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని సీఓఈ గురుకుల పాఠశాల అభివృద్ధి కమిటీ నాయకులు పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం పేరెంట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ నాయకులు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తోచిన రీతిలో పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం చేస్తున్నట్లు తెలిపారు. గురుకుల అభివృద్ధికి మేముసైతం అంటూ ముందుకొచ్చిన తల్లిదండ్రులను సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాగం మహేష్, రేణికుంట్ల శంకర్, పెరుగు తిరుపతి, ఇప్ప రవి, వెంకటస్వామి, జమ్మి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలి

జన్నారం: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్‌పై పీడీ యాక్టు నమోదు చేయాలని మాలమహానాడు జిల్లా కమిటీ సభ్యుడు జక్కుల సురేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో మాలమహానాడు, దళిత సంగాల నాయకులు సంజీవ్, బాగ్యరావు, కోడి సృజన్, వెంకటేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

మందమర్రిరూరల్: స్థానికంగా ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేవలం బీఆర్‌ఎస్ నాయకులకే కాకుండా అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని బీఎస్పీ జోనల్ కన్వీనర్ మద్దెల భవాని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్ల పంపిణీలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి అవకతవకలకు తావివ్వకూడదన్నారు. దరఖాస్తు దారుల సర్వే అనంతరం జాప్యం చేయకుండా పంపిణీ చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బీఎస్పీ జిల్లా కన్వీనర్ బొడ్డు వినోద, ప్రవళిక, లక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ జోనల్ కన్వీనర్ భవాని

ముత్తినేని అర్జున్‌రావు వర్ధంతి

మంచిర్యాలటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మంచిర్యాల మున్సిపల్ మొట్టమొదటి చైర్మన్ ముత్తినేని అర్జున్‌రావు వర్ధంతిని శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు అర్జున్‌రావు మున్సిపల్ చైర్మన్‌గా మంచిర్యాలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

గని కార్మికులకు హెల్మెట్‌పై అవగాహన

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆర్కే 7గని మేనేజర్ సాయి ప్రసాద్ తెలిపారు. గనిపై శనివారం హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ గనిలో విధుల్లో ఎలాంటి రక్షణ పాటిస్తామో, ఇంటి నుంచి డ్యూటీకి వచ్చేటప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు కూడా అంతే రక్షణ పద్ధతులు పాటించాలన్నారు. బైక్‌పై వస్తే హెల్మెట్, కారులో వస్తే సీటు బెల్టు ధరించాలన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి రవిశంకర్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకట్‌రామ్, బాలకృష్ణ, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ మెండె వెంకటి, ఏరియా సెక్రెటరీ అశోక్, నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న మేనేజర్ సాయి ప్రసాద్

సాక్షి సినిమాలు



మంచిర్యాల

శ్రీనివాస	: అమిగోస్
వెంకటేశ్వర	: వేద
జెమిని సినిమా స్క్రీన్ 1	: పఠాన్/రైటర్ పద్మభూషణ్/చెడ్డీగ్యాంగ్
జెమిని సినిమా స్క్రీన్ 2	: అమిగోస్/టైటానిక్

లక్సెట్టిపేట

మహానంద	: అమిగోస్

జన్నారం

రాఘవేంద్ర	: అమిగోస్

చెన్నూర్

శ్రీశ్రీనివాస	: అమిగోస్

బెల్లంపల్లి

రామకృష్ణ	:అమిగోస్
బాలాజీ	: పఠాన్

సీసీసీ

దేవి	: పఠాన్
తిరుమల	: అమిగోస్

– మంచిర్యాలటౌన్

విహారంలో విజ్ఞానం..!

మంచిర్యాలఅర్బన్: పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థినులు అందివచ్చిన రెండో శనివారం సెలవు దినం కావటంతో కొత్త ప్రాంతాలకు వెళ్లి విజ్ఞాన సముపార్జనకు వినియోగించుకున్నారు. మంచిర్యాల కేజీబీవీలో చదివే 10వ తరగతి, ఇంటర్ విద్యార్థినులు స్పెషల్ ఆఫీసర్ స్వప్న నేతృత్వంలో ఉపాధ్యాయులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. పురాతన దేవాలయాలు, చారిత్రాత్మకమైన కట్టడాలు రామప్ప, భద్రకాళి దేవాలయం, వెయ్యిస్తంభాల గుడి, ఖిలా వరంగల్, జైన దేవాలయాన్ని చూసి తరించిపోయారు. విహారయాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నామని విద్యార్థులు అనుభూతులు పంచుకున్నారు.

